

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 02-04-2025 | సంపుటి - 22 | సంచిక - 338 | రూ : 4 | పేజీలు : 8


## డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో కేంద్రీకృత విధానం

- ఇక హైదరాబాద్ నుంచే ఆర్సీ కార్డులు, లైసెన్సుల జారీ
- వారం రోజుల్లో టెండర్ల ప్రక్రియ
- మహారాష్ట్రలో ఇదే పద్ధతి అమలు

2లో





## సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం దిశగా భారత్, చిలీ

- సంప్రదింపులను ప్రారంభించిన ఇరు దేశాల అధినేతలు
- ప్రధాని మోదీతో చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ భేటీ

2లో

## అపోహలను తొలగించండి

- మంత్రులు, ఉన్నతాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- హెచ్‌సీయూ వివాదంపై మంత్రులతో అత్యవసర భేటీ
- అనంతరం మేధావులు, ప్రొఫెసర్లతో మంత్రుల సమావేశం



2లో



## మార్పు అంటే.. రైతులకు కన్నీళ్లా?

- ఈ దుస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదు
- ప్రజలకు మనోధైర్యం ఇచ్చేలా పార్టీ రజతోత్సవ సభ
- భారాస నేతలకు అధినేత కేసీఆర్

**దిశానిర్దేశం**

హైదరాబాద్: 'మార్పు రావాలి' అంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టిందని.. మార్పు అంటే రైతులకు కన్నీళ్లా? అని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు ఈ దుస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక

తరువాయి 2లో

## ఆవిరవుతున్న ఆశలు

- మయన్మార్‌లో 2,719కి చేరిన భూకంప మృతులు



నేపిడా, బ్యాంకాక్: మయన్మార్‌లో భూకంప మృతుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. తాజాగా ఇది 2,719కి చేరింది. వారిలో ఐదేళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారు. రాజధాని నేపిడాలోని ఓ భవంతి కిందినుంచి 91 గంటల తర్వాత ఓ మహిళ (63)ను మంగళవారం సజీవంగా బయటకు తెచ్చారు. చైనా నుంచి వచ్చిన దళాలు సోమవారం ఒక అపార్ట్‌మెంటు నుంచి ఇలాగే నలుగురిని కాపాడాయి. వీరిలో ఒక గర్భిణి, ఐదేళ్ల చిన్నారి కూడా ఉన్నారు. ఘటన జరిగిన 72 గంటల తర్వాత నుంచి బాధితులు ప్రాణాలతో ఉండేందుకు ఆస్కారం బాగా

తరువాయి 2లో

## జగన్ నొక్కిన బటన్లన్నీ.. మేమిచ్చే పింఛన్లంతే!

- సంపద సృష్టించి పేదలకు పంచుతాం
- జూన్‌లోపు ఉపాధ్యాయ ఖాళీ పోస్టుల భర్తీ
- పేదరికం నిర్మూలనకే పీ4
- బాపట్ల జిల్లా కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీలో సీఎం చంద్రబాబు

2లో



## వచ్చే మార్చికల్లా నక్సలిజం నిర్మూలన

- 'ఎక్స్' వేదికగా ప్రకటించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా

దిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం నక్సల్స్ రహిత భారతాన్ని సృష్టించే యజ్ఞంలో పురోగమిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం 'ఎక్స్'లో ప్రకటించారు. నక్సలిజం పట్ల కఠిన వైఖరి అవలంబిస్తూ నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో అభివృద్ధి

తరువాయి 2లో





## గత పాలకుల దుష్ప్రచారంతోనే భూ వివాదం

2లో

* ఆ 400 ఎకరాలు ప్రజల ఆస్తి
* హెచ్‌సీయూ నుంచి అంగుళం కూడా తీసుకోవడం లేదు
* ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి

## బర్డ్‌ఫ్లూ వైరస్‌తో రెండేళ్ల చిన్నారి మృతి

- పచ్చి కోడి మాంసం తినడంతోనే..
- రాష్ట్రంలో ఇదే మొదటి కేసు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖకు ప్రభుత్వ ఆదేశాలు

2లో



# అపోహలను తొలగించండి

హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై నెలకొన్న అపోహలను తొలగించేలా తక్షణం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ భూవివాదంపై అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం అత్యవసరంగా సమావేశమయ్యారు. దీనికి ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క తదితరులతో పాటు రెవెన్యూ, అటవీ, పరిశ్రమల శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. 1975లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి (హెచ్‌సీయూ) జరిపిన భూ కేటాయింపుల నుంచి ఇప్పటివరకూ జరిగిన పూర్తి ప్రక్రియను సీఎంకు, మంత్రులకు అధికారులు వివరించారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదేనని వారు స్పష్టం చేశారు. "1975లో హెచ్‌సీయూకు కంచ గచ్చిబౌలిలో భూమి కేటాయించారు. అయితే భూ యాజమాన్య హక్కులు బదిలీ చేయలేదు. రెవెన్యూ, అటవీ రికార్డుల ప్రకారం.. సర్వే నంబరు 25లోని భూమిని ఎప్పుడూ అటవీ భూమిగా వర్గీకరించలేదు. 2003 ఆగస్టు 9న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఐఎంజీ అకాడమీస్ భారత'తో ఒప్పందం కుదుర్చుకుంది. 2004 ఫిబ్రవరి 3న హెచ్‌సీయూ నుంచి 400 ఎకరాలను ఆ సంస్థకు అప్పగించింది. అందుకు బదులుగా గోపనపల్లిలోని సర్వే నంబర్లు 36, 37లలోని 397 ఎకరాలను హెచ్‌సీయూకు బదలాయించింది. ఐఎంజీ భారతకు భూ కేటాయింపులను 2006 నవంబరు 21న అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై ఐఎంజీ హైకోర్టుకు వెళ్లగా.. ఉన్నత న్యాయస్థానం 2024 మార్చి 7న ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ భూమి ఎన్నడూ హెచ్‌సీయూలో అంతర్భాగం కాదు. ఎప్పుడూ అటవీ ప్రాంతంగా పరిగణించలేదు. హైకోర్టు తీర్పు అనంతరం టీజీఐఐసీ అభ్యర్థన మేరకు ఆ సంస్థకు ప్రభుత్వం కేటాయించింది. ఇది పూర్తిగా ప్రభుత్వ భూమే. ఇక్కడ భారీ పెట్టుబడులకు అవకాశం కల్పించడం వల్ల సుమారు 5 లక్షల మందికి పైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా" అని ఉన్నతాధికారులు వివరించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రతిపక్ష పార్టీలు విద్యార్థులను రెచ్చగొడుతున్నాయని మంత్రులు ఈ సందర్భంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అక్కడ నెలకొన్న పరిస్థితులపై సీఎం ఆరా తీశారు.

*** అక్కడ నిర్మాణాలు చేపట్టొద్దు: మేధావులు, ప్రొఫెసర్లు**

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని మంత్రులకు పలువురు మేధావులు, ప్రొఫెసర్లు విన్నవించారు. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు మంగళవారం పలువురు మేధావులు, హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, పర్యావరణవేత్తలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇందులో ప్రొఫెసర్ హరగోపాల్, కిరణ్‌కుమార్ విస్సా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు నితిన్‌కుమార్, శ్యామల్ బిస్వాస్, మాజీ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, పీహెచ్‌డీ గ్రాడ్యుయేట్ డాక్టర్ బీరమ్ రేష్మా, రైతు స్వరాజ్య వేదిక తరఫున శ్రీహర్ష తన్నీరు, ఎన్ఏపీఎం అర్బన్ స్ట్రగుల్స్ ఫోరం ప్రతినిధి జాన్ మైఖేల్, పర్యావరణ పరిరక్షణ ప్రతినిధులు అరుణ్ వాసిరెడ్డి, శివానీ ఉపాధ్యాయ, సలహాదారు అంజురావు, మానవ హక్కుల సంఘం ప్రతినిధి బాలరాజు, హెచ్‌సీయూ విద్యార్థి సంఘం తరఫున సందీప్, పర్యావరణ సంరక్షణ సమితి ప్రతినిధి రుచిత్ ఆశా కమల్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 3 గంటలకుపైగా ఈ సమావేశం జరిగింది. పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, హెచ్‌సీయూ భూమిని లాక్కోవడం లేదని ఈ సందర్భంగా మంత్రులు పేర్కొన్నారు. హెచ్‌సీయూ నుంచి ప్రభుత్వం తీసుకున్న భూమికి ప్రత్యామ్నాయంగా అంతే భూమిని అప్పట్లోనే బదలాయించారని, ఇప్పుడు టీజీఐఐసీకి అప్పగించిన భూమి పూర్తిగా ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. వాటికి సంబంధించిన డాక్యుమెం

# జగన్ నొక్కిన బటన్లన్నీ.. మేమిచ్చే పింఛన్లంతే!

**ఒంగోలు, బాపట్ల :** 'రాష్ట్రంలో జీతాలకే డబ్బులు లేని పరిస్థితి. గత ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.10 లక్షల కోట్ల అప్పులకు ప్రతినెలా వడ్డీలు కట్టాల్సి వస్తోంది. అయినా పది నెలలుగా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తున్నాం. ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఇస్తున్నాం. రాష్ట్రంలో 1.50 కోట్ల కుటుంబాలుంటే ప్రతి నెలా 64 లక్షలమందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. అంటే సగటున ప్రతి రెండున్నరకుటుంబాలలోఒకరికిపింఛను ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. 'ఒకప్పుడు బటన్లు నొక్కేవారు.. ఆ బటన్లన్నీ మేమిచ్చే ఒక్క పింఛన్లకే సమానం' అని జగన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం సీఎం పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని పింఛన్లు అందించారు. ఇద్దరు దివ్యాంగులకు మూడుచక్రాల వాహనాలు ఇచ్చారు. 'రూ.4,000 పింఛను అంటే ఏడాదికి రూ.48 వేలు పంపిణీ చేస్తున్నాం. ఒక ఎకరా భూమిలో సాగు చేస్తే ఎంత వస్తుందో ఆలోచించండి' అని వివరించారు. సంపద సృష్టించి, వచ్చిన ఆదాయాన్ని పేదల కోసం ఖర్చు పెడతామని ముఖ్యమంత్రి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యత సాధిస్తామన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ప్రజావేదికలో పీ4 కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామంలో ఎంపిక చేసిన పేదలు (బంగారు కుటుంబం), దాతలు (మార్గదర్శులను) పరిచయం చేస్తూ ప్రసంగించారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పార్టీకి అండగా ఉంటున్న పేదలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తేవడానికి ఈ గ్రామానికి వచ్చానని పేర్కొన్నారు. అమరావతిలో తాను ఏసీ రూంలో కూర్చుంటే మంత్రులు క్షేత్రస్థాయికి వెళ్లరనే ఉద్దేశంతోనే ముందుండి నడిపిస్తున్నానని తెలిపారు.

**శభాష్ అధికారులూ..**

వలస వెళ్లిన కూలీలు ప్రతినెలా పింఛను తీసుకోలేరనే ఉద్దేశంతో మూడు నెలలపాటు తీసుకోకున్నా ఒకేసారి ఇస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ప్రతినెలా తొలిరోజే 98 శాతం పింఛన్లు అందిస్తూ అధికారులు పోటీపడి పేదలకు సేవ చేస్తున్నారని అంటూ.. వారి సేవలను 'శభాష్' అంటూ అభినందించారు.

*** సమర్థ పాలనతో అన్నీ బాగవుతాయి**

'అమరావతిలో మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మూడు, నాలుగేళ్లలో అమరావతికి పునర్వైభవం తెస్తాం. రాష్ట్రానికి పోలవరం జీవనాడి. చినగంజాం పక్కనే సముద్రం ఉన్నా నీళ్లులేవు. గోదావరి జలాలు సముద్రం పాలవుతున్నాయి. 2027లోపు పోలవరం పూర్తిచేసి నదుల అనుసంధానం చేస్తాం. దీనివల్ల వ్యవసాయం సజావుగా సాగుతుంది' అని ముఖ్యమంత్రి తెలిపారు. 'విశాఖ ఉక్కు కూడా గాడిలో పడుతోంది. పరిపాలన సమర్థంగా చేస్తే ఏదైనా బాగవుతుంది. ఈ నెలలోనే డీఎస్సీ ప్రకటన ఇచ్చి.. జూన్‌లోపు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం. జూన్‌లోపు తల్లికి వందనం అమలు చేస్తాం' అని తెలిపారు. గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. మే, జూన్‌లో సముద్రంలో చేపల వేటను నిషేధిస్తున్నందున మత్స్యకారుల కుటుంబాలకు ఈ నెలలో రూ.20 వేలు ఇస్తామన్నారు.

*** వృత్తిదారుల జీవితాలు బాగుచేస్తా**

'యాదవులు, చేనేతలు, గీత కార్మికులు ఇలా వృత్తిదారులందరి కోసం ఏం చేస్తే వారి జీవితాలు బాగుపడతాయా అని ఆలోచిస్తున్నా. గొర్రెలు, ఆవులను మేపడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఊళ్లోనే మేపుకొనే, గడ్డి పెంచుకునే పరిస్థితులు రానున్నాయి. కొత్తగొల్లపాలెంలో చదువు మానేసిన వారికి ఉపాధి కల్పించడానికి ఇంటి దగ్గర గొర్రెలు మేపుకొంటూ వ్యాపారం చేయడం నేర్పిస్తా' అని ఆయన తెలిపారు. పేదరికాన్ని తొలగించడానికి పీ4 కార్యక్రమం తీసుకొచ్చామన్నారు. తన సలహాలను పాటిస్తే ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. పీ4ను విమర్శించేవారు 100 మంది కుటుంబాలను బాగుచేస్తే సన్మానిస్తానని, మాటలు చెప్పి చెడగొడితే మంచి జరగదని పేర్కొన్నారు.

# గత పాలకుల దుష్ప్రచారంతోనే భూ వివాదం

హైదరాబాద్: "రంగారెడ్డి జిల్లా కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై వివాదం వెనుక గత పాలకుల దుష్ప్రచారం ఉంది. ఆ భూమి ప్రజలకు చెందిన రూ.వేల కోట్ల విలువైన ఆస్తి. దానిపై యాజమాన్య హక్కులను సాధించిన ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. వర్సిటీ భూములను ప్రభుత్వం గుంజుకుంటోందని అవాస్తవాలను ప్రచారం చేస్తుండటాన్ని ఖండిస్తున్నాం" అని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, పీసీసీఎఫ్ డోబ్రియాల్ తదితరులతో కలిసి మంగళవారం సచివాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వాస్తవాలేంటో రాష్ట్రానికి, దేశానికి తెలియజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. గత భారాస ప్రభుత్వం భూములపై గట్టిగా కొట్లాడలేదు: భట్టివిక్రమార్క హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూములను ప్రభుత్వం లాక్కుని అమ్ముకునే ప్రయత్నాలు చేస్తోందని కొన్ని పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క విమర్శించారు. "2004లో ఉమ్మడి ఏపీలో అప్పటి తెదేపా ప్రభుత్వం వర్సిటీ నుంచి 400 ఎకరాలు తీసుకుని ఐఎంజీ భారత స్పోర్ట్స్ అనే ప్రైవేటు సంస్థకు ఇచ్చింది. ఆ భూమికి బదులు 397 ఎకరాలను విశ్వవిద్యాలయానికి బదలాయించింది. తీసుకున్న భూమికి బదులు వేరే భూమి ఇస్తున్నట్లు ప్రభుత్వానికి, విశ్వవిద్యాలయ అధికారులకు మధ్య ఒప్పందం, పంచనామా కూడా పూర్తయింది. 400 ఎకరాలు బిల్లీరావు అనే వ్యక్తికి చెందిన సంస్థకు పోయాయి. ఆ తర్వాత 2006లో భూకేటాయింపును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆ సంస్థ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. 2014 నుంచి 2023 వరకు తెలంగాణలో భారాస అధికారంలో ఉన్నా కేసుపై గట్టిగా కొట్లాడకపోగా గాలికి వదిలేసింది. రూ.వేల కోట్ల విలువైన భూమి వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గం గట్టి నిర్ణయం తీసుకుంది. కోర్టులో కొట్లాడి హక్కులు సాధించుకున్నాం. ఈ భూములను అభివృద్ధి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కల్పనకు వినియోగమయ్యేలా ప్రభుత్వం చూస్తుంది తప్ప వేరే ఆలోచన లేదు" అని ఆయన స్పష్టం చేశారు.

*** మష్రూమ్ రాక్స్, పీకాక్ లేక్‌లను కాపాడతాం: శ్రీధర్‌బాబు**

కొంతమంది వ్యక్తులు, కొన్ని పార్టీలతో సంబంధం ఉన్న సంఘాలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. "వారం రోజుల క్రితం హెచ్‌సీయూ వీసీ, రిజిస్ట్రార్‌తో సంప్రదింపులు జరిపాం. విశ్వవిద్యాలయానికి చెందిన భూమి ఒక్క ఎకరం కూడా రికార్డుల్లో లేదని, వర్సిటీ భూమి దానికే ఉండాలని స్పష్టం చేశాం. పాలకమండలి సమావేశంలో చర్చించి వస్తే.. భూములపై చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తామని తెలిపాం. ప్రభుత్వ భూముల్లో ఉన్న రాక్ ఫౌండేషన్, మష్రూమ్ రాక్స్, పీకాక్ లేక్‌లను కాపాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిని విద్యార్థులు, వర్సిటీ సందర్శించి.. వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటుంది. ప్రజల ఆస్తులను కాపాడాలని, ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. మేం చేపడుతున్న అభివృద్ధి పనులను ఎలా అడ్డుకోవాలా అని కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడవద్దని భారాస, భాజపాలకు చెందిన మిత్రులను కోరుతున్నాం. యూనివర్సిటీ పరిధిలోని భూములను స్పష్టంగా గుర్తించి హక్కులను జారీ చేయాలని మా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది" అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## ఆవిరవుతున్న ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. 4,521 మంది గాయపడగా.. 441 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. మృతుల సంఖ్య పెరుగుతుందని భయపడుతున్నారు. సహాయక బృందాలు భూకంప తాకిడి ప్రాంతాలకు చేరుకోలేకపోతున్నాయి. రహదారులు ధ్వంసమవడం ఒక కారణమైతే.. ప్రభుత్వ, తిరుగుబాటు దళాల మధ్య ఘర్షణలు మరో ప్రధాన అవరోధంగా మారాయి. చాలాచోట్లకు ఆహారం, తాగునీరు, ఔషధాలు చేర్చలేకపోతున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో కుప్పకూలిన ఓ ఆకాశహర్మ్యం శిథిలాల కింద 300 మంది కార్మికులు చిక్కుకుని ఉంటారని, వారిలో ఎక్కువమంది విదేశాల నుంచి వచ్చినవారేనని కథనాలు వెలువడుతున్నాయి. ఇప్పటివరకూ అక్కడ 13 మృతదేహాలు బయటపడ్డాయి.

## వచ్చే మార్చికల్లా నక్సలిజం నిర్మూలన

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలు చేపడుతూ దేశంలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల సంఖ్యను 12 నుంచి 6కి తగ్గించామని పేర్కొన్నారు. 2026 మార్చి 31 కల్లా నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని భారత్ లక్షిస్తోందన్నారు. దేశంలో నక్సలిజం ప్రభావిత జిల్లాలు 38 ఉండగా, వాటిలో 12 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, ఇప్పుడు అవి ఆరుకు తగ్గాయని కేంద్ర హోంశాఖ తెలిపింది. 38 నక్సలిజం ప్రభావిత జిల్లాల్లో ఆందోళనకర జిల్లాలు ఉన్నాయనీ, వాటిలో అల్లూరి సీతారామ రాజు జిల్లా (ఆంధ్రప్రదేశ్), భద్రాద్రికొత్త గూడెం జిల్లా (తెలంగాణ) కూడా ఉన్నాయని తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న గట్టి చర్యల వల్ల తెలంగాణలోని ములుగు జిల్లాలో వామపక్ష తీవ్రవాదం తగ్గుముఖం పట్టిందని వివరించింది. నక్సలిజం వల్ల తీవ్రంగా ప్రభావితమైన జిల్లాల్లో రూ.30 కోట్లతో, ఆందోళనకర జిల్లాల్లో రూ.10 కోట్లతో మౌలిక వసతులను అభివృద్ధి చేశామని, ఈ నిధులను కేంద్రం ప్రత్యేక సహాయంగా అందించిందని హోం శాఖ వెల్లడించింది. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాల వరుస కాల్పుల్లో పలువురు మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే.

## డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో కేంద్రీకృత విధానం

హైదరాబాద్: వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు (ఆర్సీ), డ్రైవింగ్ లైసెన్సుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని వాహనదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుత విధానాన్ని మార్చాలని రవాణాశాఖ నిర్ణయించింది. సంయుక్త రవాణా కమిషనర్ (జేటీసీ) చంద్రశేఖర్‌గౌడ్ నేతృత్వంలో అధికారుల బృందం ఇటీవల మహారాష్ట్రకు వెళ్లి.. అక్కడ అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేసింది. అనంతరం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానికి ఆమోదం లభించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర తరహాలో కేంద్రీకృత (సెంట్రలైజ్డ్) విధానాన్ని తెలంగాణలో ప్రవేశపెట్టేందుకు రవాణాశాఖ సిద్ధమవుతోంది. వారం, పది రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే వాహనదారులకు త్వరగా కార్డులు అందుతాయని, పారదర్శకత ఉంటుందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

**రోజుకు 9-12 వేల ఆర్సీలు, లైసెన్సులు..**

రాష్ట్రవ్యాప్తంగా 62 ఆర్టీఓ కార్యాలయాలు ఉన్నాయి. ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సులు నిత్యం 9 వేల నుంచి 12 వేల వరకు జారీ అవుతుంటాయి. నాలుగైదు రోజుల్లో వాహనదారులకు అందాల్సిన ఈ ఆర్సీలు, లైసెన్సులు రెండు, మూడు నెలలకు గానీ అందడం లేదు. హైదరాబాద్ పరిధిలో పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీకి చెందిన ఓ మహిళ కారు కొనుగోలు చేసి రూ.1,97,200 లైఫ్‌ట్యాక్స్ చెల్లిస్తే.. ఆర్టీఓ కార్యాలయ అధికారులు మూడు నెలలపాటు ఆర్సీ కార్డు పంపలేదు. అత్తాపూర్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి డ్రైవింగ్ లైసెన్స్‌లో తన చిరునామా మార్చుకునేందుకు ఫీజు కడితే రెండు నెలల తర్వాత గానీ కొత్త చిరునామాతో డ్రైవింగ్ లైసెన్సు రాలేదు. ఈ తరహా ఇబ్బందుల్ని లక్షల మంది ఎదుర్కొంటున్నారు. ఏజెంట్ల ద్వారా వెళ్తే పని త్వరగా అయిపోతోందని.. లేకపోతే కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరగాల్సి వస్తోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

## మార్పు అంటే.. రైతులకు కన్నీళ్లా?

(మొదటిపేజీ తరువాయి)

చర్యలతో రైతులు వివిధవర్గాల ప్రజలు మనోధైర్యం కోల్పోతున్నారని పేర్కొన్నారు. భారాస రజతోత్సవ సభ కోసం ఆత్రుతతో ఎదురుచూస్తున్నారని, వారికి మనోధైర్యం ఇచ్చేవిధంగా సభ ఉండాలని కేసీఆర్ తెలిపారు. సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారని, విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న పార్టీ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లపై చర్చించేందుకు ఆ జిల్లా ముఖ్య నాయకులు మంగళవారం పార్టీ అధినేత కేసీఆర్‌తో ఎర్రవెల్లి నివాసంలో సమావేశమయ్యారు. వారికి దిశానిర్దేశం చేసిన కేసీఆర్.. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు 22.5 లక్షల మంది ప్రజలు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## బర్డ్‌ఫ్లూ వైరస్‌తో రెండేళ్ల చిన్నారి మృతి

అమరావతి: బర్డ్‌ఫ్లూ (హెచ్5ఎన్1) వైరస్‌తో పల్నాడు జిల్లా నరసరావుపేటలో రెండేళ్ల చిన్నారి మరణించింది. పచ్చి కోడి మాంసం తినే అలవాటుతో పాటు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం చిన్నారి మరణానికి దారితీసిందని వైద్యులు గుర్తించారు. బర్డ్‌ఫ్లూ కారణంగానే చిన్నారి మరణించినట్లు భారత వైద్య పరిశోధన మండలి కూడా నిర్ధారించి, రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. మార్చి 16న బాలిక చనిపోగా, వివిధ స్థాయిల్లో నమూనాలను పరీక్షించి అధికారికంగా ధ్రువీకరించారు. బర్డ్‌ఫ్లూ కారణంగా మనుషుల మరణం సంభవించడం రాష్ట్రంలో ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేసింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించింది. వివిధ దశల్లో పరీక్షలు: నరసరావుపేటకు చెందిన చిన్నారిని జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ముక్కు కారడం, మూర్ఛ, విరేచనాలు, ఆహారం తినలేని పరిస్థితిలో మార్చి 4న మంగళగిరిలోని ఎయిమ్స్‌కు తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు బాలికకు ఆక్సిజన్ సాయంతో చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. మార్చి 16న మృతిచెందింది. అయితే, చికిత్స అందించే సమయంలో మార్చి 7న పాప గొంతు, ముక్కు నుంచి తీసిన స్వాబ్ నమూనాలను ఎయిమ్స్‌లోని వీఆర్‌డీఎల్‌లో పరీక్షించారు. ఇన్‌ఫ్లుయెంజా ఎ పాజిటివ్‌గా తేలింది. అనంతరం మరో నమూనాను 15న దిల్లీలో పరీక్షించారు. అక్కడ నివేదిక అనుమానాస్పదంగా రావడంతో అప్రమత్తమైన ఐసీఎంఆర్.. 24న స్వాబ్ నమూనాలను పుణెలోని ఎన్ఐవీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ)కి పంపించింది. అక్కడ హెచ్5ఎన్1 వైరస్‌గా నిర్ధారించారు. కుటుంబ సభ్యుల విచారణ: వైద్యారోగ్య శాఖ అధికారులు తాజాగా చిన్నారి కుటుంబ సభ్యులను విచారించారు. పెంపుడు, వీధి కుక్కలతో బాలిక తరచూ ఆడుకునేదని వారు చెప్పారు. చిన్నారిలో ఫిబ్రవరి 28న జ్వర లక్షణాలు కన్పించగా, అంతకు రెండురోజుల ముందు పచ్చి కోడి మాంసం తిన్నట్లు తెలిపారు.

## సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం దిశగా భారత్, చిలీ

దిల్లీ: రక్షణ, ఆరోగ్యం, వాణిజ్యం, అరుదైన ఖనిజాలు, రైల్వేలు, అంతరిక్షం సహా వివిధ రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని, ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, చిలీ దేశాలు నిర్ణయించాయి. ఇరు దేశాలు సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం దిశగా సంప్రదింపులను ప్రారంభిస్తున్నట్లు మంగళవారం ప్రకటించాయి. అయిదు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ మంగళవారం దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. లాటిన్ అమెరికాలో భారత్‌కు చిలీ ఓ ముఖ్యమైన భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయుర్వేదం, సంప్రదాయ మెడిసిన్, వ్యవసాయ ఉత్పత్తుల సహకారంపై ఒప్పందాలు ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. గాబ్రియేల్ మాట్లాడుతూ భారత్ పర్యటన ద్వారా ఇరుదేశాల మధ్య బంధాలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. సాంస్కృతిక సహకారం అందించుకుంటామన్నారు. 'షూట్ ఇన్ చిలీ' ప్రోగ్రాం ద్వారా భారత చిత్ర పరిశ్రమతో కలిసి పని చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంటార్కిటికాలో పరిశోధనలకు సహకారం సహా ఇరు దేశాలు నాలుగు కీలక పత్రాలపై సంతకాలు చేశాయి.

**రాష్ట్రపతి భవన్‌లో విందు**

భారతదేశ పర్యటనకు తొలిసారి వచ్చిన చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ గౌరవార్థం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం రాత్రి విందు ఇచ్చారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముర్ము మాట్లాడుతూ...ఇటీవల కాలంలో పలు భారతీయ కంపెనీలు చిలీలో పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని దేశ అధ్యక్ష పదవిని చేపట్టిన గాబ్రియేల్ జీవిత ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకమని ఆమె చెప్పారు. అంతకుముందు చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. పర్యటనలో భాగంగా ఆయన ఆగ్రా, ముంబయి, బెంగళూరును సందర్శిస్తారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. గాబ్రియేల్ వెంట ఆ దేశానికి చెందిన మంత్రులు, పార్లమెంటు సభ్యులు, సీనియర్ అధికారులతో కూడిన అత్యున్నత స్థాయి బృందం దిల్లీ చేరుకుంది.

# ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలి





**: దేవలమ్మ నాగారం, ఆరెగూడెం, కాట్రేవ్ గ్రామాలలో బిజెపి సమావేశాలు కైరంకొండ అశోక్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని బిజెపి మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ డిమాండ్ చేశారు చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మ నాగారం, ఆరెగూడెం, కాట్రేవ్ గ్రామాలలో బిజెపి మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులై, లబ్ధి పొందని ప్రజలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కైరంకొండ అశోక్ మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా 6గ్యారంటీలు, హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ, 15నెలలు గడుస్తున్నా హామీల అమలులో మాత్రం నత్తనడకన పనిచేస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్లు రూ.2వేల నుంచి 4వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదని చూపించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి గృహిణికి రూ.2500లు ఇస్తామన్న హామీ జాడ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత ఉండి పథకాలు నోచుకోని ప్రజలు చాలామంది ఉన్నారని, వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ దరఖాస్తులను తహసిల్దార్, ఆర్డీవో జిల్లా కలెక్టర్ లకు అందజేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీలన్నీ నెరవేర్చే వరకు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, ఊడుగు యాదయ్య, కంది లక్ష్మారెడ్డి, మునగాల తిరుపతిరెడ్డి, చినుకని మల్లేష్ యాదవ్, మహిపాల్ రెడ్డి, శాగ చంద్రశేఖర్ రెడ్డి, మునగాల రాజశేఖర్ రెడ్డి, కట్ట కృష్ణ, దిండు భాస్కర్, నూనె మాధవి, సహదేవ్, రేవల్లి స్వప్న, సత్యనారాయణ, మునగాల జనార్దన్ రెడ్డి, నిమ్మల సత్యనారాయణ, మహేష్, బద్దం కృష్ణ, అనంతుల ఐలయ్య, గంగనబోయిన ఐలయ్య, వికార సుధాకర్ రెడ్డి, బొంగు వెంకటేశం గౌడ్, మలిగ వెంకటేశం, పి శ్రీనివాస్ చారి, సిలువేరు రమేష్, పాక రఘు పందుల భరత్ పందుల వెంకటేశం, దెందే అడవయ్య, సుంకంటి ఆదిరెడ్డి, గోధుమగడ్డ నరేందర్ రెడ్డి, బచ్చ ఐలయ్య, కడగంచి శ్రీశైలం, మల్లయ్య, మహేష్, అంజయ్య, శ్రీనివాసులు, బొడ్డుపల్లి మల్లేష్, గట్టు పవన్, పిన్నింటి చంద్ర, శేఖర్ రెడ్డి, జూపల్లి మల్లేష్, పులిగిల్ల లక్ష్మణ్, బాబుచారి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : నాలుగు వందల ఎకరాల భూమిలను డెవలప్మెంట్ పేరు మీద యూనివర్సిటీ భూములను వేలం పాటకి సిద్ధమవుతున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న దుర్మార్గాన్ని ప్రశ్నిస్తున్న బిజెపి భూముల పరిరక్షణకై బయలుదేరిన బీజేపీ మరియు బీజేవైఎం నాయకులను పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బొమ్మల రామారాం మండల కేంద్రాలలో బొమ్మలరామారం బీజేపీ మండల అధ్యక్షులు మాలోతు వినోద్ నాయక్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం.ఈ సందర్భంగా బొమ్మలరామారం బీజేపీ మండల అధ్యక్షులు మాలోతు వినోద్ నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం దేవాలయం భూముల అమ్ముకుని ప్రభుత్వం నడిపితే, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే ప్రభుత్వం యూనివర్సిటీ సంబంధించిన భూములను అమ్ముకుంటూ తమ యొక్క ప్రభుత్వాన్ని నడపాలని చూస్తుందని తెలియజేశారు ప్రభుత్వం తన యొక్క విద్యా వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తుంది అని ఇదే విధంగా కొనసాగిస్తే బొమ్మలరామారం మండల బీజేపీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్ గౌడ్,నర్సింహగౌడ్,ముక్కెర్ల గణేష్,ఆళ్ల గౌడ్, భాస్కర్, శేఖర్,గాంధీ సతీష్, రాజు ,సాయి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌బీ కాలనీలో సన్న బియ్యం పంపిణీలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ హెచ్‌బీ కాలనీ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య పాల్గొన్నారు. హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ మల్లేశ్ గౌడ్ చౌక ధరల దుకాణంలో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాయని ఉదయ్ కిరణ్, సురేష్ గౌడ్, శ్రీనివాస్, శ్రవణ్ కుమార్ గౌడ్, భానురి నిక్కి, సురేష్, అనిల్, ఎస్. మల్లేష్, మల్లిఖార్జున్, జమ్మి, మహిళా కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### సన్న బియ్యం పంపిణీ..
# నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలి

**- లకారంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభం**
**- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారంలోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కుంభం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభించారన్నారు. ధనవంతులు మాత్రమే సన్నబియ్యం, నిరుపేదలు సన్న బియ్యానికి నోచుకునే వారు కాదన్నారు. ఆ నమ్మకాన్ని పటాపంచలు చేస్తూ ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేపట్టిందన్నారు. సన్న బియ్యం పంపిణీ నిరుపేదలకు వరం లాంటిదన్నారు. అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ జరుగుతుందని, నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆర్డీవో శేఖర్ రెడ్డి మాట్లాడుతూ చౌటుప్పల్ మండల పరిధిలో 19,171తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. అన్ని రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం తీసుకోవచ్చన్నారు. ఒకరికి 6కిలోల చొప్పున, అంత్యోదయ కార్డు ఉన్నవారికి 30కిలోలు సన్నబియ్యం అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేన రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, వైస్ చైర్మన్ చెన్నగొని అంజయ్య గౌడ్, తహసిల్దార్ హరికృష్ణ, మాజీ కౌన్సిలర్లు కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, కొయ్యడ సైదులు, బాబా షరీఫ్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, బక్క శ్రీనాథ్, శ్రీ సీతారామ దేవస్థానం అధ్యక్షులు బొబ్బిలి మురళి, శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థాన కమిటీ చైర్మన్ చిలుకూరి మల్లారెడ్డి, పాశం సంజయ్ బాబు, కొలను శ్రీనివాస్ రెడ్డి, గుర్రం కొండల్, వీరమళ్ళ సత్తయ్య, మాదగోని శేఖర్ గౌడ్, తీగుళ్ల చంద్రయ్య, ఎర్రగోని లింగస్వామి యాదవ్, బండమీది వెంకటేశం, పస్తం గంగరాములు, బొడ్డు గాలయ్య, బద్దం పాండురెడ్డి, బద్దం కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్ లైన్ డెలివరీ చేసే ఉద్యోగులకు అండగా ఉంటా

*** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆన్ లైన్ డెలివరీ చేసే ఉద్యోగులకు అండగా ఉంటానని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. రెప్పపాటు సమయంలో (క్షణాల్లో) మనకు నిత్యఅవసర వస్తువులను, మన అవసరానికి అందించే ప్రముఖ కంపెనీ బిలింక్ ఇట్ లో పనిచేస్తూ ఆన్ లైన్ డెలివరీ చేస్తున్నా 100 మంది డెలివరీ బాయ్స్ లలో కొందరిని రోజువారి ఇన్సెంటివ్ ను పెంచు మన్నందుకు, అవగాహన ,సమాచార లోపం వల్ల ఇద్దరి మధ్య విభేదాలు వచ్చి సుమారు 30 మంది డెలివరీ బాయ్స్ ను గత వారం కిందట కంపెనీలో నుంచి తొలగించి, మళ్లీ పనిలోకి తీసుకోలేము అని దృఢంగా చెప్పింది, వారం నుంచి రోజువారి వేత్తనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న డెలివరీ బాయ్స్ వడ్డేపల్లి రాజేశ్వరరావు ని ఆశ్రయించగా, వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రముఖ కంపెనీ యొక్క యాజమాన్యాన్ని పిలిపించి ఇద్దరితో మాట్లాడి ఇరువురి మధ్య సయోధ్య కుదిరించారు, దూర ప్రాంతాల నుండి పొట్టచేత పట్టుకుని వచ్చినటువంటి గ్రామీణ యువతకు కంపెనీలో మళ్లీ అవకాశం కల్పించి,న్యాయం చేసి వారిని ఆదుకోవాలని తెలియజేశారు, రాజేశ్వరరావు చెప్పడంతో కంపెనీ నుంచి తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకుంటామని సదరు యాజమాన్యం వారు రాజేశ్వరరావు కి హామీ ఇచ్చారు, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు చాలా ప్రమాదకరమని, క్రమం తప్పకుండా పనిచేసుకుంటూ యాజమాన్యంతో మంచిగా ఉండాలని డెలివరీ బాయ్స్ కు రాజేశ్వరరావు సూచించారు.

## పాలన చేతకాక ప్రభుత్వ భూములు అమ్మకానికి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

*** బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు బోల్ల సుదర్శన్**



యాదాద్రి భువనగిరి ,(ప్రజా స్ఫూర్తి) : రేవంత్ రెడ్డి సర్కార్కు పాలించడం చేతగాక ప్రభుత్వ ఆస్తులైనటువంటి యూనివర్సిటీల భూములు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను అమ్మకానికి పెట్టి ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వారికి ధారాధత్వం చేయడం కోసం హైదరాబాదులోని హెచ్ సి యు యూనివర్సిటీ 400 ఎకరాల భూములను అమ్మకానికి పెట్టిందే కాక, నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, బిజెపి ఎమ్మెల్యేలను, బీజేవైఎం నాయకులను అక్రమంగా అరెస్టు జరిగింది. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీలో ఒక మాట, రాష్ట్రంలో మరో మాట మాట్లాడడం ఈ కాంగ్రెస్ ద్వంద్వ విధానాలకు నిదర్శనం అని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు బోల్ల సుదర్శన్ వెల్లడించడం జరిగింది. రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ ఈ నిరంకుశ కాంగ్రెస్ ప్రభుత్వం పైన దాని విధానాల పైన గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యవంతులు గా చేయడం జరుగుతుందని వారు పత్రిక ప్రకటనలో తెలియజేయడం జరిగింది.

## ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : హైదరాబాదులోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిలను డెవలప్మెంట్ పేరు మీద యూనివర్సిటీ భూములను వేలంపాటకి సిద్ధమవుతున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేవైఎం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేస్తుంటే పోలీసులు అక్రమంగా బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేయడం జరిగింది ఈ సందర్భంగా బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బోడ బుచ్చిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం దేవాలయం భూముల అమ్ముకుంని ప్రభుత్వం నడిపితే ప్రస్తుత ప్రభుత్వం యూనివర్సిటీ సంబంధించిన భూములను అమ్ముకుంటూ తమ యొక్క ప్రభుత్వాన్ని నడపాలని చూస్తుందని తెలియజేశారు ప్రభుత్వం తన యొక్క విద్యా వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తుంది అని ఇదే విధంగా కొనసాగిస్తే బీజేవైఎం ఆధ్వర్యంలో వారి నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ఆకుల దేవేందర్ కార్యదర్శి ఉమామహేశ్వర్ ఉపాధ్యక్షుడు పందిరి సందీప్ కార్యదర్శి కాలూరి విజయ్,శివాత్రి అనిల్ ,చింతకింది మహేష్ భరత్ అరవింద్ నిఖిల్ భాను తరుణ్ నరసింహ చారి ఈ కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలోని పలు సమస్యలపై భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కు వినతి



యాదాద్రి భువనగిరి (ప్రజాస్ఫూర్తి ) : భువనగిరి మండలంలోని రామచంద్రపురం గ్రామంలోని పలు సమస్యల పరిష్కారానికై ఎన్ ఎస్ యు ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సురుపంగ చందు రామచంద్రపురం గ్రామ ప్రజల తరఫున మంగళవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. గ్రామంలో నూతన వాటర్ ఫిల్టర్, అసంపూర్తిగా ఉన్న బిసి కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయాలని, అవసరమున్న చోట సీసీ రోడ్లు మంజూరు చేయాలని, వ్యవసాయ బావుల వద్ద 2 నూతన 100కేవీ ట్రాన్స్ఫార్మర్ లు ఏర్పాటు చేసే విధంగా సంబధిత అధికారులతో చర్చించాలని కోరడం జరిగింది. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉగ్గి దుర్గా ప్రసాద్, కొండోజు రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల జీవనశైలి తెలుసుకునే విధంగా గిరిజన మ్యూజియం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం స్వామి వారి కళ్యాణానికి వచ్చే భక్తులు గిరిజనుల జీవనశైలి తెలుసుకునే విధంగా గిరిజన మ్యూజియంను ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు.మంగళవారం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్, ఎస్పీ రోహిత్ రాజ్ తో కలిసి ఆయన సందర్శించి మ్యూజియంలో గిరిజన సాంస్కృతిక సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కల్చర్కు సంబంధించిన కళాఖండాలను పెయింటింగ్ చిత్రాలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల సాంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అంతరించి పోకుండా నేటి యువతరానికి పాతకాలపు కట్టుబాట్లు వారి జీవన శైలి తెలుసుకొని ఆచరించే విధంగా గిరిజన మ్యూజియంను ఏర్పాటు చేశామన్నారు. తాతల కాలం నాటి పాత తరం గిరిజనుల ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, అడవులనే నమ్ముకొని జీవించిన విధివిధానాలను నేటి గిరిజన యువత అవగాహన కల్పించుకొని ఆచరించే విధంగా మ్యూజియంలో పొందుపరిచిన ప్రతి కళాఖండాలు చూపరులకు ఆకట్టుకునే విధంగా ఉన్నాయని అన్నారు. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఖండాంతరాలకు తెలిసే విధంగా గిరిజన మ్యూజియమును శ్రీరామనవమి రోజున ప్రారంభిస్తున్నామని, శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం వీక్షించడానికి వచ్చే భక్తులు మ్యూజియం కూడా సందర్శించే విధంగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మాట్లాడుతూ సందర్శకులకు ఆకట్టుకునేలా మ్యూజియంలోని ప్రతి కళాఖండాలను చూపరులకు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేశామని, గిరిజనుల సాంస్కృతికి సాంప్రదాయాలు , గిరిజనులు వేటాడే పద్ధతి, వారి జీవన విధానాలు, పల్లె ప్రాంతాలలో పంచాయతీలకు సంబంధించిన రచ్చబండ, గిరిజన తెగలకు సంబంధించిన దేవతామూర్తులను మరియు పూజా విధానం, పాతకాలపు ఇండ్లు, వారి ఆయుధాలు అన్ని మ్యూజియంలో పొందుపరిచామని, కళలకు సంబంధించిన పెయింటింగ్ చిత్రాలను కూడా ఏర్పాటు చేశామని, మ్యూజియం సందర్శించడానికి వచ్చే పర్యాటకుల కొరకు చిన్నపిల్లలకు బోటింగ్ సౌకర్యం కల్పించామని, చిన్నపిల్లలు ఆడుకునే క్రీడా స్థలంతో పాటు సందర్శకులు ఆదివాసి గిరిజనుల వంటకాలు చవి చూడడానికి స్టాల్స్ ఏర్పాటు చేశామని, మ్యూజియం సందర్శించిన పర్యాటకులు సేద తీరడానికి పార్కును కూడా సిద్ధం చేశామని, ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను టూరిజం స్పాట్గా చేయడానికి అన్ని హంగులతో ఈ మ్యూజియంను సర్వ సుందరంగా విద్యుత్ కాంతులతో అలంకరించామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, తాసిల్దార్ శ్రీనివాస్, ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాప్ లో సన్నబియ్యం పథకం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : తెలంగాణ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచిత సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలుగు నూతన సంవత్సర ఉగాది సందర్భంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఈ పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్బంగా మేడ్చల్ జిల్లా కాప్రా డివిజన్ ఎల్లారెడ్డి గూడలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగశేషు అధ్వర్యంలో ఏర్పటు చేసిన కార్యక్రమం లో పాల్గోని ప్రారంభించడం జరిగింది తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న బిపిఎల్ కుటుంబంలోని ప్రతి సభ్యునికి ముతక బియ్యం బదులుగా ఆరు కిలోల సన్న బియ్యాన్ని ప్రారంభించడం జరిగింది ,అనంతరం పత్తికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 89.73 లక్షల తెల్లరేషకార్డులు ఉండగా, వీటి ద్వారా 2.8 కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారు. 30 లక్షల కొత్త దరఖాస్తులతో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3.10 కోట్లకు చేరుకుంటుంది. రేషన్ దుకాణాల ద్వారా 3.10 కోట్ల మందికి ఉచిత సరుకు బియ్యం అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారని అన్నారు ఈ పథకానికి ప్రభుత్వం ఏటా రూ.10,600 కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజు, నాగరాజు, సతీష్, శ్రీనివాస్ గౌడ్, తోటకూర శ్రీకాంత్, జగదీష్, సుమన్, షాబుద్దీన్, ఆరిఫ్, రాజు, నరేందర్ గౌడ్, విటల్ నాయక్, పూర్ణయదవ్, మల్లారెడ్డి, బాబూరావు ఖాన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులుగా లక్కినేని సత్యనారాయణ, అనుబ్రోలు రాంప్రసాద్ రావు నియామకం





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులుగా ప్రముఖ సీనియర్ న్యాయవాదులు లక్కినేని సత్యనారాయణ (ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు) అనుబ్రోలు రాంప్రసాద్ రావులను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు జారీ చేసిన జీవో నెంబర్ 198 ప్రకారం, వీరు రెండు సంవత్సరాల కాలానికి ఈ పదవిలో కొనసాగుతారు.ఈ నియామకం ద్వారా న్యాయ సేవాధికార సంస్థ మరింత బలోపేతం అవుతుందని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే అన్ని కార్యాక్రమాలలో వీరు అధికారికంగా పాల్గొనవచ్చు. న్యాయ సేవలను ప్రజలకు సమర్థంగా అందించడంలో వీరి అనుభవం, నైపుణ్యం ఎంతో ఉపయోగపడనుందని న్యాయ పరిధిలోని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు.ఈ నియామకాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పలువురు న్యాయ రంగ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. లక్కినేని సత్యనారాయణ, అనుబ్రోలు రాంప్రసాద్ రావుల నియామకం ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవల విస్తరణ మరింత మెరుగుపడుతుందని ఆశిస్తున్నారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన సభ్యులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, న్యాయ సేవలను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## ఏకగ్రీవంగా శ్రీ లక్ష్మి నరసింహ స్వామి తాపీ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక



యాదాద్రి భువనగిరి , (ప్రజా స్ఫూర్తి) : యాదగిరిగుట్ట పట్టణంలో నేడు తాపీ కార్మిక సంఘం వారి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది అందులో భాగంగా కార్మిక సంఘం పెద్దలు కార్మికుల ఏకాభిప్రాయంతో సంఘం నూతన కమిటీని 18 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా పబ్బాల శ్రీరాములు వంశరాజ్, ఉపాధ్యక్షులుగా దొమ్మాట కుమ్మరి సంజీవ, ప్రధాన కార్యదర్శి పబ్బాల రాజు వంశారాజ్ కోశాధికారి పబ్బాల ఉప్పలయ్య వంశరాజ్, సహాయ కార్యదర్శి పబ్బాల రమేష్ వంశరాజ్, లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ కమిటీని మాజీ అధ్యక్షులు ముఖ్యర్ల కొమురయ్య యాదవ్, నాగపురి శ్రీను, కంబాల జహంగీర్, ముఖ్యర్ల సత్యనారాయణ యాదవ్ గార్ల పర్యవేక్షణలో జరిగింది ఈ ఎన్నికలో 150 మంది తాపీ కార్మిక సంఘ సభ్యులు పాల్గొని ఈ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సంధర్బంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ ఈ తాపీ కార్మిక సంఘం బాధ్యతను మాపై నమ్మకంతో పెట్టినందుకు అందరికి ధన్యవాదాలు తెలిపారు అలాగే ఈ కార్మిక సంఘంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకునేందుకు పూర్తి బాధ్యత వహిస్తాము దినసరి కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడిపే ప్రతీ ఒక్కరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు అలాగే బిల్డింగ్ కాంట్రాక్టు విషయంలో ఎవరైనా ఇంటి యజమానులు గుత్తేదారులకు నష్టం కలిగించే విధంగా చేస్తే గుత్తేదారులకు సంగ సభ్యులకు వెన్నంటూ ఉండి వారికి తగిన న్యాయం చేస్తాము అలాగే ఈ కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన ఘత కమిటీ వారికి పెద్దమనుషులకు పేరు పేరునా కృతజ్ఞతలు చెప్పారు ఈ కార్యక్రమంలో 150మంది సంగ సభ్యులు పాల్గొనడం గమనార్హం...

## కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పేదల పట్ల వెన్నుదన్నుగా ఉంటుంది

*** కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి**




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రోటీ కపడ ఔర్ మకాన్ అనే నినాదం మీద కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పేదల పట్ల వెన్నుదన్నుగా ఉంటుందని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి సూచన మేరకు కూకట్ పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్ బీ డివిజన్ లో డివిజన్ అధ్యక్షులు తమ్మి నేని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర సీఎం ఆదేశాల ప్రకారం రేషన్ దుకాణం ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ అంటే కరీబి హటావో అనే బాటలో నడుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యాన్ని సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా పౌష్టిక విలువలు కలిగిన సన్న బియ్యం పంపిణీని రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించారన్నారు. . ముఖ్యమంత్రి స్ఫూర్తితో గత పది సంవత్సరాల్లో ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వని ఆనాటి (టిఆర్ఎస్ నిన్నటి బి ఆర్ ఎస్ రేపటి విఆర్ఎస్ పార్టీ) అని మాట్లాడడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండారగల్ల సంజీవ రావు, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, ఫణీంద్ర కుమార్, బి బ్లాక్ అధ్యక్షురాలు సంధ్య, రేష్మ, యమునా, దేవ సహాయం రవి, కొమ్ము బాబు, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళ నాయకురాలు యూత్ కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల్లో 'సన్నబియ్యం'కీలకం

*** ప్రభుత్వ ప్రతిష్టను పెంచనున్న సన్నబియ్యం పథకం**

*** కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల్లో సన్న బియ్యం పంపిణి పథకం కీలకంగా మారనుందని, పేద కుటుంబాల ఆకలితీర్చే ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సాహసమేనని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 28వ వార్డు రామాటాకీస్ ఏరియా, చుంచుపల్లి మండలంలోని రాంనగర్, సుజాతనగర్లో రేషన్ షాపుల్లో సన్నబియ్యం పథకాన్ని కూనంనేని ప్రారంభించి మాట్లాడారు. గత పాలకుల సన్న బియ్యం పథకం అమలు ప్రకటనకు పరిమితమైందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాలకు ఈ పథకం ఆదర్శమని అన్నారు. పేదల బియ్యం పక్కదారి పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగ నాగసీతారాములు, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి రుక్మిణీదేవి, సివిల్ సప్లైస్ డిఎం త్రినాథ్, సీల్దార్లు పుల్లయ్య, కృష్ణ, శిరీష, డిటి మహేష్, స్థానికులు వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, భాగం మహేశ్వర్ రావు, జక్కుల రాములు, కొమారి హన్మంతరావు, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, నేరెళ్ల శ్రీనివాస్, భూక్యా శ్రీనివాస్, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణ చారి, సుధాకర్, దుర్గ, యాలాద్రి, యాకుబ్, యాసిన్, వేణు, రామారావు తదితరులు పాల్గొన్నారు.




## కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వడానికి ఎల్లవేళలా సిద్ధం

*** టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గత 22 సంవత్సరాలుగా ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి పాల్వంచ కళా పరిషత్ సేవాసమితి ఆధ్వర్యంలో ఎంతో అట్టహాసంగా ఉగాది సంబరాలు నిర్వహించడం పలువురికి ఆదర్శంగా నిలుస్తుందని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. మున్ముందు ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని, వాటికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్న ఆయన మన సంస్కృతి సంప్రదాయాలు మరుగున పడుతున్న వేళ ఉగాది పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని ఇంతటి మంచి కార్యక్రమాన్ని చేయడం కొత్తగూడెం, పాల్వంచ ప్రజల అదృష్టమన్నారు. రాబోయే రోజుల్లో కళాకారులకు పెద్ద పీట వేసే విధంగా తను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. సనాతన ధర్మాన్ని, సంప్రదాయాలను కాపాడటంలో ప్రతిఒక్కరు ముందుండాలన్నారు. ఈ సంవత్సరమంతా వ్యాపార అభివృద్ధిలో, అష్టఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరికి శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేసారు. వేముల కొండలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజుగౌడ్, డాక్టర్ సుధాకర్ బాబు, యుగేందర్ రెడ్డి, బుచ్చయ్య చౌదరి, రోషయ్య, లింగమూర్తి, పురప్రముఖులు,కళాకారులు పాల్గొన్నారు.

## చలి వేంద్రాలు బాటసారుల దాహర్తిని తీర్చేందుకు దోహదం

*** వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు**




శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : చలి వేంద్రాలు బాటసారుల దాహర్తిని తీర్చేందుకు ఎంతగానో దోహదపడుతుందని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ లోని సుమిత్రానగర్ జాతీయ రహదారి పైన చైతన్య నగర్ వినాయక యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో చేపట్టినా చలివేంద్రాన్ని కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు సందర్శించి అక్కడికి వచ్చిన బాటసారులకు మజ్జిగ , త్రాగు నీరును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చైతన్య నగర్ వినాయక యూత్ అసోసియేషన్ వారు మజ్జిగ తాగునీరు కార్యక్రమం ప్రతి వేసవి కాలంలో ఏడవ సారి పెట్టడం జరిగిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేసినందుకు చైతన్య నగర్ పెద్దలను , వినాయక యూత్ అసోసియేషన్ వారిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి కాలనీలో మెయిన్ సెంటర్లలో పెట్టడానికి ముందుకు రావాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కర్ రావు , చైతన్య నగర్ కమిటీ మెంబర్స్, సుమిత్ర నగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించే విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నాం

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం, పట్టాభిషేకం మహోత్సవమునకు విచ్చేసే ప్రముఖులకు, భక్తులకు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఎవరు ఇబ్బందులు పడకుండ మొట్టమొదటిసారిగా ఫాగ్ మీస్ట్ ఏర్పాటు చేసి స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించే విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం భద్రాచలంలోని స్వామి వారి కళ్యాణం జరుగు మిథిలా స్టేడియంలో కళ్యాణం కొరకు జరుగుతున్న ఏర్పాట్లను ఐటీడీఏ పీవో బి, రాహుల్, ఎస్పీ రోహిత్ రాజ్ తో కలిసి ఆయన పరిశీలించారు. వివిఐపీలు, వీఐపీలు మరియు భక్తులు కూర్చొని



స్వామి వారి కళ్యాణం అందరికీ కనిపించేలా తిలకించే విధంగా ప్రదేశాలను సెక్టార్లవారీగా ఏ విధంగా ఏర్పాట్లు చేయాలో అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణం, పట్టాభిషేకం మహోత్సవాలకు వి వి ఐ పి, విఐపి లతోపాటు దేశ విదేశాల నుండి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున వేసవికాలంలో భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రశాంతంగా కళ్యాణం, పట్టాభిషేకం వీక్షించడానికి మిథిలా స్టేడియంలోని సౌకర్యాలు ఈనెల 5వ తారీఖు వరకు పూర్తి పూర్తిచేసే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, భక్తులకు మంచినీటి సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్లు పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ మరియు వై టి సి, స్వచ్ఛంద సంస్థల ద్వారా భద్రాచలంలోని స్వామివారి కల్యాణ మండపంతో పాటు ముఖ్య కూడళ్ళలో వాలంటీర్స్ ద్వారా అందించడానికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామని, భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశామని, వచ్చే భక్తులు భద్రాచలం పట్టణాన్ని కలుషితం చేయకుండా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించుకొని ఎక్కువ శాతం పేపర్ బ్యాగులను ఉపయోగించాలని, శానిటేషన్ పరంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భద్రాచలం పట్టణంలో మరియు గోదావరి ఘాటు దగ్గర, టౌన్ పాయింట్లలో టాయిలెట్లు ఏర్పాటు చేశామని, భక్తులు సెద తీరడానికి అన్నిచోట్ల టెంట్లు, చలువ పందిళ్లు నిర్మాణం చేపట్టామని, భక్తులు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా గ్రామపంచాయతీ ద్వారా డస్ట్ బిన్లు ఏర్పాటు చేశామని, పంచాయతీ సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా అన్నిచోట్ల సిబ్బందిని అందుబాటులో ఉంచామని అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఎవరికి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి దర్శనాన్ని చేసుకొని తీర్థ ప్రసాదాలు అందుకొని సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుకునే విధంగా అధికారులందరూ మీకు సహాయ సహకారాలు అందిస్తారని, భక్తులు కూడా తొందరపడకుండా అధికారుల సూచనలు పాటించి వారికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీవో దామోదర్ రావు, దేవస్థానం ఈవో రమాదేవి,తాసిల్దార్ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ బ్రహ్మయ్య, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏవో గన్యా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ దేశంలోనే చారిత్రాత్మక నిర్ణయం

*** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**




యాదాద్రి భువనగిరి , ప్రజా స్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్లో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి వెంకట రెడ్డి,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు నియజకవర్గం నుండి పెద్ద ఎత్తున్న మహిళలు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రైతుల పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రభుత్వం 2వేల 858 కోట్లు ఖర్చు చేసి ప్రతి ఒక్క పేద కుటుంబానికి ప్రతి మనిషికి ఆరు కిలోల చొప్పున ప్రతి ఒకరికి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, మహిళల ను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని,ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం ప్రారంభించిన ముఖ్యంగా ముందుగా మహిళలకు ప్రాధాన్యం ఇస్తుందని, అందులో భాగంగా మొదటిగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు , ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలు ద్వారా ప్రతి ఒక్క అర్హులకు సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని, ప్రతి ఒక్క కుటుంబానికి 500 కే గ్యాస్ ఇవ్వడం జరుగుతుందని, ప్రతి ఒక్క అర్హులైన పేద కుటుంబానికి ఇంటికి 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్క సంక్షేమ కార్యక్రమంలో మహిళలను చైతన్యం పర్చుతూ ముందంజలో ఉండేలా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ప్రభుత్వం వచ్చాక ఎన్నో బ్రిడ్జిలు నిర్మించి ఆలేరు నియోజకవర్గంలో 120 చెరువులు నింపి పంటలు సమృద్ధిగా పండించుకుంటున్నామని అన్నారు. నీళ్లు ,నిధులు, నియామకాలు అనేదే ప్రభుత్వ లక్ష్యమని దానికి అనుగుణంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని అన్నారు.

## ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టే ఏ పథకమైన ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీది

*** కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ): . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏదైనా పని అనుకుంటే సాధించి చూపెడతారని అందుకు నిదర్శనం ఈ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం అని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం ప్రజా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పార్టీకార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య మూసాపేట యాదవ బస్తీలో ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేశంలో ముందుగా ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పేద, వెనుకబడిన యువతకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు



రాజీవ్ యువశక్తి పథకాన్ని ప్రారంభించారన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టే ఏ పథకమైన ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతీ కార్యకర్త నాయకుడి పై ఉందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా లక్షల మంది పేద ప్రజలకు ఆర్థికంగా ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు.గతంలో లావు రకం బియ్యం లబ్ధిదారులు అమ్ముకునేవారని ప్రస్తుతం ఈ సన్న బియ్యం పంపిణీ ద్వారా అలాంటి పరిస్థితి ఏర్పడదన్నారు. ఈ పథకం ద్వారా రూ.50 వేల నుండి నాలుగు లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తారని, ఇందులో 75 శాతం సబ్సిడీ ఇవ్వడం ద్వారా యువతకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ పథకాన్ని ఉపయోగించుకొని అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్ ,బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు , యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు , కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాలాజీనగర్లో సన్న బియ్యం పథకం ప్రారంభం




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం , ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సన్న బియ్యం కార్యక్రమం లో భాగంగా మంగళవారం బాలాజీనగర్ డివిజన్ లో ఏర్పాటు చేసిన సన్న బియ్యం పథకాన్ని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు జవహర్ బాల్ మంచ్ , స్టేట్ కోఆర్డినేటర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ లు పాల్గొని పలు రేషన్ దుకాణం లో తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పథకాని ప్రారంభించి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జిట్టా సుశీల్ కుమార్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్యుఐ నాయకులు రాహుల్ సింగ్ చౌహాన్ ,బాలాజీ నగర్ డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు అల్లావుద్దీన్ ,జాహిర్ యువజన కాంగ్రెస్ నాయకులు విశాల్ ,నంద కిషోర్,రాజు ,కార్తీక్,ప్రేమ్,సంతోష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జీడిమెట్ల ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి శ్రీనివాస్ అన్నారు. పారిశ్రామిక హమాలి యూనియన్ ఏఐటియుసి సిఐటియు ఆధ్వర్యంలో జీడిమెట్ల హమాలీ అడ్డ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జీడిమెట్ల ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి శ్రీనివాస్ , ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ , సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో హమాలీ పనులు చేస్తూ జీవనం గడుపుతూ జీడిమెట్ల నర్సాపూర్ ప్రధాన రహదారిపై గత పది సంవత్సరాల నుండి చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారుల దాహాన్ని తీరుస్తు సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతున్న హమాలి కార్మికులందరికీ పేరు పేరునా అభినందనలు తెలియజేశారు. రానున్న కాలంలో మరిన్ని సామాజిక, సేవ, కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు స్వామి, సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ దేవదానం, ఏఐటియుసి సిఐటియు, నాయకులు శ్రీనివాస్ అంజయ్య, హమాలీ సంఘం నాయకులు కే శీను, నరసింహారెడ్డి కరుణాకర్, మహేష్ మల్లారెడ్డి, శేఖర్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు

## సంక్షేమ పథకాల్లో 'సన్నబియ్యం'కీలకం

*** ప్రభుత్వ ప్రతిష్టను పెంచనున్న సన్నబియ్యం పథకం**

*** కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల్లో సన్న బియ్యం పంపిణి పథకం కీలకంగా మారనుందని, పేద కుటుంబాల ఆకలితీర్చే ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సాహసమేనని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 28వ వార్డు రామాటాకీస్ ఏరియా, చుంచుపల్లి మండలంలోని రాంనగర్, సుజాతనగర్లో రేషన్ షాపుల్లో సన్నబియ్యం పథకాన్ని కూనంనేని ప్రారంభించి మాట్లాడారు. గత పాలకుల సన్న బియ్యం పథకం అమలు ప్రకటనకు పరిమితమైందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాలకు ఈ పథకం ఆదర్శమని అన్నారు. పేదల బియ్యం పక్కదారి పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఏ నిముషానికి ఏం జరుగునో..

*** బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న పశువైద్య సిబ్బంది**

*** అవసాన దశకు వెటర్నరీ హాస్పిటల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సుమారు 80 గ్రామాలలో ఉండే మూగజీవాలకు వైద్యం అందించే పెద్దాసుపత్రి అది. కాని నేడు ఆ పెద్దాసుపత్రి అనారోగ్యంతో మూలుగుతోంది. ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయాందోళనతో పశువైద్య ఆస్పత్రి సిబ్బంది విధులు నిర్వర్తించే పరిస్థితులు ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం రామవరంలో ఉన్న పశు వైద్యశాల జిల్లాలోనే అతిపెద్దది. ఈ ఆస్పత్రి పరిధిలో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం మండలాల్లోని సుమారు 80 గ్రామాలు విస్తరించి ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న ఆవులు, గేదెలు, కుక్కలు, పిల్లులు, ఇతర మూగజీవాలకు రామవరం పశు వైద్యశాలలో వైద్యం అందిస్తారు. ఆస్పత్రి సిబ్బంది సైతం ప్రభుత్వం నిర్దేశించే లక్ష్యాలను నెరవేరుస్తూ, పశువులకు నట్టల మందులు, వ్యాక్సినేషన్ వంటి క్యాంపులు సైతం నిర్వహిస్తున్నారు. పశువులకు సైతం మెరుగైన వైద్యం అందిస్తూ రైతులు, పశువుల



యజమానుల నుండి ప్రశంసలు సైతం అందుకుంటున్నారు.

### అవసాన దశలో వెటర్నరీ ఆస్పత్రి..

జిల్లా కేంద్రానికి అతి సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ పశువైద్యశాల నేడు అవసాన దశలో కొట్టుమిట్టాడుతుంది. సుమారు 40 ఏళ్ల చరిత్ర కలిగిన పశువైద్యశాలకు 2000 సంవత్సరంలో నూతన భవనం నిర్మించినప్పటికీ అసంపూర్తిగా నిర్మించినట్లు అక్కడివారు చెప్తున్నారు.



భవనంలో విద్యుత్, నీరు, ఫర్నీచర్ వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నాటి నుండి ఆ ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్లు, సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. వైద్యం కోసం పశువులను తీసుకుని వచ్చినా సౌకర్యాల లేమితో సరైన సేవలు అందించలేకపోతున్నామని పేర్కొంటున్నారు. అదేవిధంగా మూగజీవాలను తీసుకువచ్చేవారు కూడా ఆస్పత్రి భవనం పరిస్థితిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. వర్షాకాలం



వచ్చినప్పుడు భవనం నుండి గదుల్లో నీళ్లు కారుతుండటంతో సిబ్బంది ఆస్పత్రిలో కూర్చుని విధులు నిర్వర్తించలేకపోతున్నారు. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు.

*** మరమ్మతులు లేదా నూతన భవనం నిర్మించాలి: ఆనందరావు, పశువైద్యాధికారి, రామవరం**



శిథిలమైన భవనంతో భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నాం. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వైద్యం కోసం పశువులను తీసుకువచ్చేవారు కూడా సౌకర్యాలలేమితో అవస్థలకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం ఉన్న భవనానికి మరమ్మతులు నిర్వహించడం లేదా శాశ్వత భవనాన్ని నిర్మించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాం.

వేసవిలో దొరికే ముఖ్యమైన పండ్లలో తాటి ముంజలు కూడా ఒకటి. ఇవి చూడటానికి జెల్లీలా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉంటాయి. తియ్యగా, నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపలి భాగంలో నీరు ఉంటుంది. వీటిని కన్నడలో 'తాటి నుంగు' అని.. తమిళంలో 'నుంగు' అని అంటారు. ఈ పండు శరీరానికి కలిగించే చలువ వల్ల దీన్ని 'ఐస్ యాపిల్' అని కూడా అంటారు. ఎండాకాలం ప్రారంభం కాగానే తాటి ముంజలు మార్కెట్లో మనకు దర్శనమిస్తాయి. మరి శరీరాన్ని చల్లబరిచే ఈ తాటి ముంజల్లో ఉండే పోషకాలు.. ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తాయి. అవేంటో తెలుసుకోవాలంటే ఇది చదవాల్సిందే!





# పోషకాల తాటి ముంజలు.. ప్రయోజనాలెన్నో!

## చలువ కోసం..

ఈ పండులో క్యాలరీలు తక్కువ మొత్తంలో, శరీరానికి కావాల్సిన శక్తి ఎక్కువ మొత్తంలో ఉంటాయి.. కాబట్టి వేసవిలో చలువ కోసం తాటి ముంజల్ని తినడం చాలా అవసరం. కొంతమందికి ఎండాకాలంలో వేడికి ముఖంపై చిన్న చిన్న పొక్కుల్లా వస్తుంటాయి. వీటి నుంచి ఉపశమనం పొందాలంటే కూడా తాటి ముంజల్ని తినాల్సిందే! డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం..

ఎండాకాలంలో ఎన్ని నీళ్లు తాగినా అది చెమట రూపంలో బయటికి వెళ్లిపోయి డీహైడ్రేట్ అయిపోవడం సర్వసాధారణం. కాబట్టి ముంజల్లో నీటి శాతం అధికంగా ఉండటం వల్ల వీటిని తింటే ఈ సమస్య నుంచి మనల్ని కాపాడుకోవచ్చు. వేసవిలో శరీరానికి కావాల్సిన ఖనిజాలు, చక్కెరలను ఇవి బ్యాలన్స్ చేస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ బి, ఐరన్, క్యాల్షియం శరీరానికి చాలా అవసరం. ఈ పండ్లు లీచీ పండును పోలి ఉంటాయి. రుచి లేత కొబ్బరిలా ఉంటుంది.

## బరువునూ తగ్గిస్తాయి..!

తాటి ముంజల్లో శరీరానికి కావాల్సిన ఎ, బి, సి విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్ఫరస్, పొటాషియం.. వంటివి పుష్కలంగా ఉంటాయి. వీటిలో అధిక మొత్తంలో నీరు ఉండటం వల్ల శరీర బరువును తగ్గించడంలో ఇవి ఎంతగానో తోడ్పడతాయి.



## విషపదార్థాలు మాయం..

తాటి ముంజలు కాలేయ సంబంధ సమస్యల్ని కూడా తగ్గిస్తాయి. ఈ పండులో అధిక మొత్తంలో ఉండే పొటాషియం శరీరంలో ఉండే విషపదార్థాలను తొలగిస్తుంది.

## గర్భిణులకూ మంచిదే..

ప్రెగ్నెన్సీ సమయంలో కొంతమందికి ఏది తిన్నా జీర్ణం కాకపోవడం లాంటి సమస్య ఎదురవుతుంది. అలాంటి వారు ముంజల్ని తినాలి. ఫలితంగా జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అంతేకాకుండా.. ఈ సమయంలో ఎదురయ్యే మలబద్ధకం, ఎసిడిటీ.. లాంటి ఆరోగ్య సమస్యల్ని కూడా దూరం చేస్తాయి ఈ పండ్లు. అలాగే శరీరంలో గ్లూకోజ్ స్థాయిని పెంచి.. శరీరానికి కావాల్సిన మినరల్స్, న్యూట్రియంట్ల శాతాన్ని బ్యాలన్స్ చేయడంలో కూడా ముంజలు కీలక పాత్ర పోషిస్తాయి.

## అలసట దూరం..

వేసవిలో అలా కాసేపు బయటికి వెళ్లొస్తేనే అలసిపోతాం కదా! అంతేకాదు.. విపరీతమైన చెమట కూడా పట్టేస్తుంది. ఫలితంగా శరీరం అధిక మొత్తంలో నీటిని కోల్పోతుంది. ఈ క్రమంలో శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించి, అలసట నుంచి ఉపశమనం పొందడానికి ఒక సులువైన మార్గం.. తాటి ముంజల్ని తినడం.

## పొట్టు తీయకుండా తినాలి..

చాలామంది ముంజల పైన పొట్టు లాగా ఉండే పైపొర తీసేసి తింటారు. కానీ ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయి. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవి చాలా అవసరం. అలాగే ఈ పొట్టు వల్లే శరీరానికి ఎక్కువ చలువ చేస్తుంది. కాబట్టి తాటి ముంజల్ని పొట్టు తీయకుండా తింటేనే ఆరోగ్యానికి మంచిది.

---

# వేడి తగ్గించే వాటర్ యాపిల్!

యాపిల్ పండు గురించి అందరికీ తెలుసు... కానీ, వాటర్ యాపిల్ గురించి మాత్రం అందరికీ తెలియకపోవచ్చు. దీన్నే షుగర్ యాపిల్, బెల్‌ఫ్రూట్, గులాబ్ జామూన్... వంటి అనేక పేర్లతో పిలుస్తారు. ఈ కాలంలో దొరికే దీన్ని తింటే ఆరోగ్య ప్రయోజనాలెన్నో!



* ఫ్రీరాడికల్స్‌తో పోరాటం... వాటర్ యాపిల్‌లో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ అని పిలిచే ఫినోలిక్ కాంపౌడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్ వల్ల దెబ్బతిన్న కణాలకు రక్షణగా నిలుస్తాయి. ఫలితంగా క్యాన్సర్, ఆర్థరైటిస్, గుండె జబ్బులు... వంటివాటి బారిన పడకుండా ఉంటాం. అంతేకాదు, ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని వ్యర్థాలనూ బయటకి పంపిస్తాయి. తెల్ల రక్తకణాల ఉత్పత్తినీ, వ్యాధినిరోధకశక్తినీ పెంచుతాయి.
* డీహైడ్రేషన్ రాకుండా... పేరుకి తగ్గట్లే వాటర్‌యాపిల్‌లో నీటి శాతం ఎక్కువ. ఇది డీహైడ్రేషన్ సమస్యను తగ్గించడమే కాదు... బరువూ తగ్గేలా చేస్తుంది. ఇందులోని ఫైబర్ జీర్ణసంబంధిత సమస్యల్ని రానీయదు. డయాబెటిస్‌తో బాధపడేవారి రక్తంలో అధికంగా ఉన్న చక్కెర స్థాయుల్ని తగ్గిస్తుంది.





# అమెరికా టారిఫ్‌ల భయం..

## భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఇవాళ భారీ నష్టాలతో ముగిశాయి. అమెరికా టారిఫ్‌లు భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1400 పాయింట్లకు పైగా క్షీణించగా.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 23,200 మార్క్ దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.5 లక్షల కోట్లు క్షీణించి రూ.409 లక్షల కోట్లకు పడిపోయింది.

సెన్సెక్స్ ఉదయం 76,882.58 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,414.92) నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,912.18 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1390.41 పాయింట్ల నష్టంతో 76,024.51 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 353.65 పాయింట్ల నష్టంతో 23,165 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

### పతనానికి కారణాలు..

ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయం ప్రకటించనున్న నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దేశీయ ఐటీ కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. అలాంటిది అమెరికాలో ఐటీకి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చనే అంచనాలతో ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ, హెచ్‌సీఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీవల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి చేరింది. భారత్ చమురును ప్రధానంగా దిగుమతి చేసుకునే దేశం కావడంతో మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇటీవల దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా 8 సెషన్లలో దాదాపు 5 శాతానికి పైగా పెరిగాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.

ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లలో అమ్మకాలు సూచీలను డీలాపడేలా చేశాయి. వొడాఫోన్ ఐడియాలో వాటాను పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించడంతో ఆ టెలికాం కంపెనీ షేర్లు నేడు 20 శాతం మేర రాణించాయి. స్పెక్ట్రమ్ కోసం వొడాఫోన్ ఐడియా చెల్లించాల్సిన మొత్తానికి సంబంధించి తాజాగా ఈక్విటీ షేర్లను ప్రభుత్వానికి కేటాయిస్తున్నట్లు సంస్థ తెలిపింది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 22.6% వాటా ఉండగా.. అది తాజాగా 49 శాతానికి పెరిగింది.

# టెస్లా షోరూమ్‌లో అగ్నిప్రమాదం.. 17 కార్లు దగ్ధం



**టెస్లా:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా షోరూమ్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఇటలీలోని రోమ్ శివార్లలో గల టెస్లా షోరూమ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 17 కార్లు పూర్తిగా కాలిపోయినట్లు ఇటాలియన్ అగ్నిమాపక అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో షోరూమ్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం సంభవించలేదని, ఎవరూ గాయపడలేదని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు.

ట్రంప్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టిన టెస్లా బాస్ ఎలాన్ మస్క్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ట్రంప్ ఏర్పాటు చేసిన డోజ్ శాఖ అధిపతిగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫెడరల్ ఉద్యోగుల తొలగింపుతో టెస్లాను బహిష్కరించాలంటూ అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. పలుచోట్ల నిరసనకారులు విధ్వంసానికి పాల్పడుతున్నారు. అమెరికా వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో టెస్లాపై స్థానికులు దాడులు చేస్తున్నారు. షోరూమ్‌పై కాల్పులు, నిప్పంటించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఆయా ఘటనల్లో అనేక టెస్లా కార్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఇప్పుడు ఈ దాడులు అమెరికా వెలుపల కూడా చోటు చేసుకోవడం గమనార్హం. ఇటీవలే ఇటలీలో మస్క్, ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు జరిగినట్లు స్థానిక మీడియా నివేదించింది.

మరోవైపు ఇలా వరుస దాడులపై టెస్లా బాస్ ఎలాన్ మస్క్ ఇప్పటికే స్పందించిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలను ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. ఈ స్థాయిలో హింస చాలా పెద్ద తప్పని వ్యాఖ్యానించారు. తన సంస్థ కేవలం ఎలక్ట్రిక్ కార్లను మాత్రమే తయారు చేస్తుందన్నారు. ఇలాంటి దాడులకు కారకులైన వారిని ఏమీ చేయలేదంటూ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఆయా ఘటనలపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

## తగ్గిన ఎల్‌పీజీ సిలిండర్ ధర!



**న్యూఢిల్లీ:** చమురు కంపెనీలు శుభవార్త చెప్పింది. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.41 తగ్గింది. తగ్గిన ధరలు మంగళవారం నుంచే అమలులోకి వస్తాయని చమురు కంపెనీలు ప్రకటించాయి. సవరించిన ధరలతో దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,762కి చేరింది. ముంబయిలో రూ.1,714.50, కోల్‌కతాలో రూ.1,872, చెన్నైలో రూ.1,924.50కి ధర తగ్గింది. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరతో పాటు పలు కారణాలతో సాధారణంగా ప్రతినెలలోనూ చమురు కంపెనీలు ధరలను సర్దుబాటు చేస్తుంటాయి.

మార్చి 1న రూ.6 ధర పెరిగిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 1 రూ.7 తగ్గించిన తర్వాత తాజాగా మరోసారి ధర తగ్గించింది. గత డిసెంబర్‌లో కమర్షియల్ సిలిండర్ ధర ఏకంగా రూ.62 పెరిగింది. తాజా ధర తగ్గింపు రెస్టారెంట్లు, హోటళ్లు, బల్క్ ఎల్‌పీజీపై ఆధారపడే వ్యాపారులకు కొంత ఉపశమనం కలిగిస్తుందని భావిస్తున్నారు. చమురు కంపెనీలు కమర్షియల్ సిలిండర్ ధరలను తగ్గించినా.. 14.2 డొమెస్టిక్ సిలిండర్ల ధరలను యథావిధిగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించాయి.

# ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ గోల్స్

## హాకీకి వీడ్కోలు పలికిన దిగ్గజ క్రీడాకారిణి వందనా కటారియా



**న్యూఢిల్లీ:** భారత మహిళల హాకీ జట్టు చిరస్మరణీయ విజయాల్లో భాగమైన వందనా కటారియా వీడ్కోలు పలికింది. దేశం తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆమె 32 ఏళ్ల వయసులో మంగళవారం రిటైర్మెంట్ ప్రకటించింది. 15 ఏళ్ల తన సుదీర్ఘ కెరియర్‌కు అల్విదా చెప్పడం బాధగానే వెల్లడించింది వందన. తనకెంతో ఇష్టమైన హాకీకి వీడ్కోలు పలుకుతున్నందుకు మనసులో బాధగానే ఉందని.. అయినా సరే నిర్ణయం తీసుకోలేక తప్పదని చెప్పింది వందన.

'15 ఏళ్లుగా దేశానికి ప్రాతినిధ్యం వహించాను. నాలో చేవ తగ్గిందని వైదొలగడం లేదు. ప్రస్తుతం కెరియర్‌లో ఉన్నత స్థితిలో ఉన్నాను. ఫామ్‌లేమితో జట్టుకు దూరమైనప్పుడు కాకుండా.. నేను ఈ సమయంలోనే రిటైర్మెంట్ తీసుకోవడం సముచితంగా ఉంటుందని భావించాను. ఇప్పటికీ నేను గొప్పగా ఆడగలను' అని ఫార్వర్డ్ ప్లేయర్ తెలిపింది. చివరిసారిగా టీమిండియా తరఫున భువనేశ్వర్‌లో జరిగిన ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ 2024-25లో ఆడింది వందన.

'వీడ్కోలు పలకాలని నిర్ణయించుకోవడం తేలికేమి కాదు. ఇదే సరైన సమయం అని భావించాను. నాకు హాకీ ఆరోప్రాణం లాంటిది. టీమిండియా జెర్సీ ధరించడం నాకు లభించిన గొప్ప గౌరవం. అయితే.. ప్రతి ప్రయాణానికి ఎక్కడో ఒక దగ్గర ముగింపు ఉంటుంది. ప్రస్తుతం ఎంతో గర్వంగా, కృతజ్ఞతాభావంతో ఆట నుంచి వైదొలుగుతున్నా. ఇన్నేళ్ల కెరియర్‌లో నాకు మద్దతుగా నిలిచిన కోచ్‌లు, సహచరులు, సహాయక సిబ్బంది.. హాకీ ఇండియా, నా కుటుంబసభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు' అని తన విడ్కోలు సందేశంలో చెప్పింది వందన.

ఫార్వర్డ్ ప్లేయర్ అయిన వందన 15 ఏళ్ల తన సుదీర్ఘ కెరియర్‌లో దేశం తరఫున 320 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. తద్వారా బ్లూ జెర్సీతో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకుంది. మైదానంలో మెరికలా కదులుతూ ప్రత్యర్థి డిఫెన్స్‌ను కకావికలం చేసే తను 158 గోల్స్ సాధించిందీ ప్లేయర్.

### ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ గోల్స్

ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన వందనకు చిన్నప్పటి నుంచి హాకీ అంటే ఇష్టం. ఆ ఆటనే ప్రాణంగా ప్రేమించిన తను 2009లో సీనియర్ జట్టుకు ఎంపికైంది. అసమాన ప్రతిభాపాటవాలతో జట్టులో కీలక ప్లేయర్‌గా ఎదిగింది. ఈ క్రమంలోనే భారత మహిళల హాకీ జట్టు సాధించిన అద్భుత విజయాల్లో భాగమైంది. 206, 2023లో మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో స్వర్ణ పతకం గెలవడంలో వందన పాత్ర మరువలేనిది. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ గోల్స్ కొట్టిన తొలి ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పిన ఈమె టీమిండియా 4వ స్థానంలో నిలవడంలో ముఖ్య భూమిక పోషించింది.

# వచ్చే 'వన్డే వరల్డ్ కప్ ఆడుతా'..

## వీడ్కోలు వార్తలకు చెక్ పెట్టిన కోహ్లీ



**న్యూఢిల్లీ:** భారత జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అభిమానులకు తీపి కబురు చెప్పాడు. తన వీడ్కోలు గురించి ప్రచారమవుతున్న వదంతులను తోసిపుచ్చాడు. టీ20లకు రిటైర్మెంట్ పలికిన తాను వన్డేలకు అందుబాటులో ఉంటానని, వచ్చే వన్డే వరల్డ్ కప్‌లోనూ ఆడతానని చెప్పాడు విరాట్. ఐపీఎల్ 18వ సీజన్‌లో చెలరేగి ఆడుతున్న కోహ్లీ తాజాగా ఒక ఈవెంట్‌కు హాజరయ్యాడు. అక్కడ నిర్వాహకులు, అభిమానులు అతడిని 'మీ సుదీర్ఘ కెరియర్‌లో తర్వాతి పెద్ద అడుగు ఏంటీ?' అని అడిగారు.

అందుకు.. తర్వాతి బిగ్ స్టెప్ అంటే.. ప్రస్తుతానికి కచ్చితంగా ఫలానా అని చెప్పలేను. కానీ, వచ్చే వరల్డ్ కప్ గెలవాలని ఉంది. అదే బహుశా నా కెరియర్‌లో మరో పెద్ద అడుగు అని బదులిచ్చాడు కోహ్లీ. అతడి సమాధానం విన్న అక్కడివారంతా చప్పట్లు కొడుతూ భారత స్టార్ ప్లేయర్‌కు మద్దతు తెలిపారు.

వెస్టిండీస్ గడ్డపై నిరుడు టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన విరాట్.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. సఫారీలను ఓడించి ట్రోఫీ గెలుపొందిన తర్వాత భావోద్వేగానికి గురైన అతడు.. పొట్టి ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. అతడిని అనుసరిస్తూ కెప్టెన్ రోహిత్ శర్మ, రవీంద్ర జడేజాలు టీ20లకు వీడ్కోలు పలికారు. అప్పటి నుంచి వన్డేలు, టెస్టులకు మాత్రమే అందుబాటులో ఉంటున్నారీ సీనియర్ త్రయం.

అయితే.. ఈ మధ్యే ఈ ముగ్గురి సెంట్రల్ కాంట్రాక్ట్‌లో మార్పులు తథ్యమనే వార్తలు వినిపించాయి. ప్రస్తుతం ఏ ప్లస్ విభాగంలో ఉన్న విరాట్, రోహిత్, జడ్డూలను ఏ కేటగిరీ ఆటగాళ్లుగా పరిగణించాలని బీసీసీఐ భావిస్తుందనే కథనాలు ప్రసారమయ్యాయి. ఈ నేపథ్యంలో తాను దక్షిణాఫ్రికా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలని భావిస్తున్నట్టు విరాట్ చెప్పడంతో రిటైర్మెంట్ ఇప్పట్లో లేనట్టే అని అభిమానులు మురిసిపోతున్నారు. ప్రస్తుతం 36 ఏళ్లున్న కోహ్లీ.. ఫిట్‌నెస్ రీత్యా, ఫామ్ రీత్యా.. వరల్డ్ కప్ టోర్నీలో ఆడేందుకు అన్ని విధాలా అర్హుడే. ఇప్పటికే 2011 వన్డే వరల్డ్ కప్, 2013 ఛాంపియన్స్ ట్రోఫీ, ఈమధ్యే ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపొందిన జట్టులో సభ్యుడైన విరాట్ మరొక వరల్డ్ కప్ ఆడి.. ట్రోఫీని ముద్దాడితే చూసి తరించాలని ప్రతి ఒక్కరి కోరిక.

# అరుదైన ఫీట్‌ని సాధించిన సూర్యకుమార్ యాదవ్..!



**ముంబయి:** ముంబయి ఇండియన్స్ బ్యాట్స్‌మెన్ సూర్యకుమార్ యాదవ్ అరుదైన ఘనత సాధించాడు. ముంబయిలోని వాఖండే స్టేడియంలో సోమవారం రాత్రి కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఘనత విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో గెలిచి.. ఈ సీజన్‌లో ముంబయి తొలి విజయాన్ని నమోదు చేసింది. కేకేఆర్‌కు ఇది రెండో ఓటమి కాగా.. పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరింది. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ ఆకట్టుకున్నారు. తొమ్మిది బంతుల్లో మూడు బౌండరీలు, రెండు సిక్సర్ల సహాయంతో 27 పరుగులు చేశాడు.

దాంతో టీ20 క్రికెట్‌లో అరుదైన ఫీట్‌ని అందుకున్నాడు. టీ20 8వేల పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా ఘనత సాధించాడు. టీ20ల్లో సూర్యకుమార్ 8వేల కంటే ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్స్ సరసన నిలిచాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, సురేశ్ రైనా ముందున్నారు. 288వ టీ20 మ్యాచ్‌లో సూర్య కుమార్ ఈ ఘనతను సాధించాడు. ఇప్పటి వరకు అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలో విరాట్ ముందున్నాడు. విరాట్ 12,976 పరుగులు చేయగా.. రోహిత్ శర్మ (11,851), శిఖర్ ధావన్ (9,797), సురేశ్ రైనా 8,654 పరుగులతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

# చిత్తుగా ఓడిన లక్నో



## శ్రేయాస్, నేహల్ వధేరా విధ్వంసక ఇన్నింగ్స్..

**లక్నో:** ఐపీఎల్ 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ రెండో విజయం సాధించింది. తొలిపోరులో గుజరాత్ టైటన్స్‌కు షాకిచ్చిన పంజాబ్.. లక్నో వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(69), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(52 నాటౌట్ : 34 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు), ఇంప్యాక్ట్ ప్లేయర్ నేహల్ వధేరా(43 నాటౌట్ : 25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు) ధనాధన్ ఆడారు. వీరిద్దరి మెరుపులతో లక్నోపై 8 వికెట్ల తేడాతో జయకేతనం



ఎగురవేసింది పంజాబ్. 16.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఏకపక్ష పోరులో లక్నోపై 8 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసి నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకుంది పంజాబ్.

ఐపీఎల్ టైటిల్ వేటలో ఉన్న పంజాబ్ కింగ్స్ అదరగొడుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ సేన ఘన విజయం సొంతం చేసుకుంది. ఆల్‌రౌండ్ షోతో లక్నో సూపర్ జెయింట్స్‌ను 8 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. 172 పరుగుల ఛేదనలో ఓపెనర్ ప్రియన్ష్ ఆర్య(8) త్వరగానే వెనుదిరిగినా.. ప్రభ్‌సిమ్రాన్ సింగ్(69) మరింత ధాటిగా ఆడాడు. పవర్ ప్లేలో 62-1తో పటిష్ఠ స్థితిలో నిలిచిన పంజాబ్ ఇన్నింగ్స్ మరింత వేగంగా సాగింది. అర్ధ శతకం తర్వాత ప్రభ్‌సిమ్రాన్ మరింత ధాటిగా ఆడాడు.

ప్రభ్‌సిమ్రన్ 110 వద్ద ఔటయ్యాక కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు జత కలిసిన ఇంప్యాక్ట్ ప్లేయర్ నేహల్ వధేరా ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి పంపి లక్ష్యాన్ని మంచుముక్కలా కరిగించాడు. బిష్ణోయ్ వేసిన 14వ ఓవర్లో ఇంప్యాక్ట్ ప్లేయర్ నేహల్ వధేరా 6,4, 6 తో 16 రన్స్ పిండుకున్నాడు. అవేశ్ ఖాన్ వేసిన తర్వాతి ఓవర్లో గేర్ మార్చిన శ్రేయాస్ 4, 6 బాదాడు. శార్దూల్ ఠాకూర్‌కు చుక్కలు చూపిస్తూ నేహల్ వరుసగా రెండుసార్లు బంతిని స్టాండ్స్‌లోకి పంపి జట్టు స్కోర్ 160 దాటించాడు. ఐదో బంతిని బౌండరీకి పంపగా స్కోర్ సమం అయింది. మరుసటి ఓవర్లో అయ్యర్ సిక్సర్‌తో అర్ధ శతకం సాధించి.. జట్టుకు 8 వికెట్ల విజయాన్ని అందించాడు.

### ఆదుకున్న పూరన్, బదొని

హిట్టర్లతో నిండిన లక్నో సూపర్ జెయింట్స్ పెద్ద స్కోర్ చేయలేకపోయింది. పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్(3-43) విజృంభణతో ఆది నుంచి తడబడుతూ సాగింది. పవర్ ప్లేలోనే 3 కీలక వికెట్లు కోల్పోయిన జట్టును నికోలస్ పూరన్(44), ఆయుష్ బదొని(41)లు ఆదుకున్నారు. పంజాబ్ స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొంటూ లక్నో స్కోర్‌బోర్డును ఉరికించారు. అర్ధ సెంచరీకి ముందు పూరన్ ఔటైనా.. అబ్దుల్ సమద్(27)తో కలిసి బదొని సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో, పంత్ సేన నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేయగలిగింది.

# ధనుష్ డైరెక్టర్‌తో రామ్‌చరణ్..?

**టాకీస్:** దక్షిణాది చిత్రపరిశ్రమలో స్టార్ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు ధనుష్. నటుడిగా, గాయకుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నాడు. హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాల్లో నటిస్తున్నాడు. తమిళంతోపాటు తెలుగులోనూ ఈ హీరోకు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అలాగే హిందీలోనూ పలు సినిమాలతో అలరించాడు ధనుష్. తుళ్లువతో ఇలామై సినిమాతో హీరోగా తెరంగేట్రం చేసిన ధనుష్.. ఇప్పటివరకు అనేక హిట్ చిత్రాలతో అడియన్స్ ముందుకు వచ్చాడు. హీరోగానే కాకుండా కంటెంట్ ప్రాధాన్యత ఉన్న విభిన్నమైన సినిమాలను ఎంచుకుంటూ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నాడు. ఇన్నాళ్లు తమిళంలో వరుస సినిమాల్లో నటించిన ధనుష్.. ఇటీవలే సార్ సినిమాతో నేరుగా టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఇటీవలే జాబిలమ్మ నీకు అంత కోపమా సినిమాతో దర్శకుడిగా మరో




సక్సెస్ అందుకున్నాడు. తాజాగా మరో సినిమాను రూపొందించేందుకు సిద్ధమైనట్లు టాక్ వినిపిస్తుంది. జాబిలమ్మా నీకు అంత కోపమా సినిమా తర్వాత ధనుష్, అజిత్ హీరోగా ఓ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు వార్తలు వినిపించాయి. అయితే దీని గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. తాజాగా ధనుష్ కొత్త సినిమా గురించి మరో క్రేజీ న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. ధనుష్ తెరకెక్కించే కొత్త సినిమాలో హీరోగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించనున్నట్లు టాక్. ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు రామ్ చరణ్. ఇటీవలే గేమ్ ఛేంజర్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చిన చరణ్.. ప్రస్తుతం పెద్ది చిత్రంలో నటిస్తున్నాడు. డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ధనుష్ దర్శకత్వంలో చరణ్ నటించనున్న సినిమాపై క్యూరియాసిటి నెలకొంది. వీరిద్దరి కాంబోలో రాబోయే సినిమా గురించి త్వరలోనే అప్డేట్స్ రానున్నాయట. ప్రస్తుతం ధనుష్ కుబేర, ఇడ్లీ కడై చిత్రాల్లో నటిస్తున్నాడు. అలాగే 'తేరే ఇషాక్ మైన్' అనే హిందీ చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో కృతి సనన్ ప్రధాన పాత్రలో నటిస్తుంది.

# అందం, అభినయంతో అదరగొడుతున్న పాయల్‌రాజ్‌పుత్

**టాకీస్:** ఆర్ ఎక్స్ 100 సినిమాతో మంచి పాపులారిటీ సంపాదించుకున్న చిన్నది పాయల్ రాజ్ పుత్. ఈ ముద్దుగుమ్మ తన అందచందాలతో ఎప్పుడూ నెట్టింట్లో తెగ ట్రెండ్ అవుతుంటుంది. తాజాగా ఈ బ్యూటీ షార్ట్ డ్రెస్ లో తన గ్లామర్ తో కుర్రకారుకు చెమటలు పట్టిస్తుంది. డెమిన్ క్లాత్ తో తయారు చేసిన ఈ డ్రెస్ లో ఋ అమ్మడు చాలా అందంగా ఉంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. అందాల ముద్దుగుమ్మ పాయల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. చేసిన సినిమాలు తక్కువే అయినా ఈ బ్యూటీ యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఆర్ ఎక్స్ 100 సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుంది. మరీ ముఖ్యంగా ఈ సినిమాలో పాయల్ తన గ్లామర్ తో కుర్రకారుకు నిద్రలేకుండా చేసింది. పాయల్ రాజ్ పుత్ మొదటి సినిమా మంచి గుర్తింపు తెచ్చినప్పటికీ అంతగా అవకాశాలు రాలేదు. ఆర్ ఎక్స్ 100 సినిమా తర్వాత పాయల్ డిస్కో రాజా, వెంకీ మామా, అనగనగా ఓ అతిథి, పకపా. మాయాపేటిక,మంగళ వారం వంటి సినిమాల్లో నటించింది. ఈ సినిమాల్లో మంగళవారం మూవీతో మరోసారి ఈ అమ్మడుకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమాలో పాయల్ తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ బ్యూటీ ఎప్పుడూ తన వరస ఫొటో షూట్ తో నెటిజన్స్ ను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ నటి, డెమిన్ క్లాత్ తో తయారు చేసిన సింగిల్ పీస్ షాట్ ధరించి తన అందాలతో మత్తెక్కిస్తుంది. డిఫరెంట్ ఫోజులతో ఉన్న ఈ ఫొటోలు నెటిజన్స్ ను తెగ ఆకట్టు కుంటున్నాయి.




# శ్రీలీలకు నిరాశను కలిగించిన రాబిన్‌హుడ్




టాకీస్: తెలుగులో వరుస హిట్లతో అతి తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న యంగ్ హీరోయిన్ శ్రీలీల. బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ టాలీవుడ్ ఇండస్ట్రీలో బిజీ హీరోయిన్ గా దూసుకుపోయింది ఈ ముద్దుగుమ్మ. ధమాకా సినిమాతో ఈ అమ్మడు క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ సినిమాలో తన ఎనర్జిటిక్ డ్యాన్సులతో అదరగొట్టింది. కానీ ఆ తర్వాత ఈ అమ్మడు ఖాతాలో అదే స్థాయిలో హిట్టు రావడం లేదు. కొన్నాళ్లుగా ఆమె చేస్తున్న ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడుతూనే ఉన్నాయి. స్కంద, ఆదికేశవ, ఎక్స్?ట్రార్డినరీ మ్యాన్ ఇలా శ్రీలీల నటించిన అన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను నిరాశపరుస్తున్నాయి. ఆ తర్వాత వచ్చిన గుంటూరు కారం సినిమాతో ఓ హిట్ పడింది. కానీ ఈ సినిమా శ్రీలీలకు అంతగా క్రేజ్ రాలేదు. ఇక గుంటూరు కారం సినిమా తర్వాత చాలా కాలం గ్యాప్ తీసుకున్న శ్రీలీల.. ఇప్పుడు రాబిన్ హుడ్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. నితిన్ హీరోగా నటించిన ఈ సినిమా ఇటీవలే థియేటర్లలో రిలీజ్ రాగా.. మిశ్రమ స్పందన వచ్చింది. ఈ సినిమాతో శ్రీలీలకు మరోసారి నిరాశే ఎదురయ్యింది. నిజానికి ఈ మూవీలో ముందుగా రష్మిక చేయాల్సింది. కానీ డేట్స్ అడ్జస్ట్ కాకపోవడంతో ఆమె స్థానంలోకి శ్రీలీల వచ్చింది. దీంతో ఇప్పుడు ఈ అమ్మడు ఖాతాలో మరో ఫ్లాపు వచ్చి చేరింది.

# మళ్లీ ప్రభాస్‌తో నటించనున్న దిశాపటాని

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. కొన్ని నెలలుగా రాజాసాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్నారు డార్లింగ్. ఇదిలా ఉంటే.. డార్లింగ్ సరసన మరోసారి ఛాన్స్ కొట్టేసింది బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ. ఇప్పటికే ప్రభాస్ తో కలిసి ఓ సినిమాలో నటించి మెప్పించింది దిశా పటానీ. కొన్నాళ్లుగా బాలీవుడ్ ఇండస్ట్రీలో సరైన హిట్టు కోసం ఎదురుచూస్తున్న ఈఅమ్మడుకు.. ఇప్పుడు ప్రభాస్ సరసన వరుస ఆఫర్స్ వస్తున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా దిశా పేరు మారుమోగుతుంది. మోడలింగ్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టిన దిశా పటానీ.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని హైలెట్ అయ్యింది. ఆ తర్వాత వరుణ్ తేజ్ సరసన లోఫర్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. కానీ ఈ సినిమా ఫ్లాప్ కావడంతో ఆమె బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. హిందీలో వరుస ఆఫర్స్ అందుకుంటూ అక్కడే స్టార్ స్టేటస్ సంపా దించుకుంది. చాలా కాలం తర్వాత ఇటీవల నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి చిత్రంలో ప్రభాస్ జోడిగా కనిపించింది. ఈ మూవీతో పాన్ ఇండియా లెవల్లో మరోసారి పాపులర్ అయ్యింది. ఇక ఇప్పుడు మరోసారి ప్రభాస్ సరసన కనిపించనుందట. డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వం లో డార్లింగ్ నటిస్తున్న సినిమా లో ఇమాన్వీ కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిం దే. ఇందులో మరో హీరోయిన్ దిశా పటానీ కనిపించనుందని అంటున్నారు.




# శోభితకు బంపరాఫర్

## తమిళ దర్శకుడి సినిమాలో అవకాశం

**టాకీస్:** అక్కినేని కోడలు, నటి శోభితా ధూళిపాళ్ల బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. పెళ్లికి ముందు బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ నాగచైతన్యతో పెళ్లి అనంతరం కొద్దిరోజులు సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మళ్లీ సినీ రంగంలోకి




అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది ఈ భామ. తమిళ ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ ఒక సినిమాను తెరకెక్కించబోతుండగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా శోభితా ధూళిపాళ్లకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. తమిళ అగ్ర దర్శకుడిలలో పా.రంజిత్ ఒక్కడు. అట్టకత్తి మద్రాస్, కబాలి, కాలా, సర్పాట్ట పరంబరై, తంగలాన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ని సంపాదించుకున్నాడు రంజిత్. అయితే తంగలాన్ తర్వాత రంజిత్ వెట్టువం అనే ఒక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో దినేశ్ హీరోగా నటించబోతుండగా.. ఆర్య విలన్ పాత్రలో నటించనున్నాడు.
అట్టకత్తి చిత్రం తరువాత వీరి కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. అయితే ఈ సినిమాలోనే శోభితా ధూళిపాళ్లను హీరోయిన్‌గా తీసుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే శోభితకు ఇది మంచి అవకాశం అని చెప్పవచ్చు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.